

12న విశాఖ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి విశాఖ కంచరపాలెంలోని ప్రభుత్వ ఐటిఐ (ఓల్డ్)లో ఈనెల 12న ఉదయం 9గంటల నుంచి అశోక్ లేలాండ్ కంపెనీ జాబ్‌మేళా నిర్వహిస్తోందని స్థానిక ప్రభుత్వఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి తెలిపారు. ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్ , ఆటో పెయింటర్ ట్రేడ్లలో పాసైన వారు ఈ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అభ్యర్థుల వయో పరిమితి 26ఏళ్లని, ఈ ఏడాది ఉత్తీర్ణులైన వారు కూడా అర్హులని పేర్కొన్నారు. దుబాయిలో పనిచేయాల్సి ఉంటుందని, పాస్‌పోర్టు ఉన్న వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రవాణా, వసతి, భోజన సదుపాయం ఉచితంగా ఉంటాయని, మెడికల్ ఇన్సూరెన్సు సదుపాయం కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డ్, 2 ఫోటోస్‌తో పాటు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 9440197068, 9849118075 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నష్టం లేదట !

- ఉన్న పరిస్థితి చెప్పేందుకు ఉలికిపాటు ఎందుకో?
- నీటి మునిగిన వేలాది ఎకరాల పంట పొలాలు
- కొట్టుకుపోయిన కాజ్‌వేలు, కల్వర్టులు ● కష్ట నష్టాలను ప్రకటించని అధికారులు



గుర్ల మండల కేంద్రంలో నీటమునిగిన వరిపంట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పెద్దగా నష్టాలేమీ జరగలేదట. అక్కడక్కడా పంటపొలాల్లో నీరు చేరినప్పటికీ సోమవారం నాటికే కిందికి పోయిందట. జిల్లావాసులకు పెద్ద ఇబ్బందులేవీ తలెత్తలేదంటూ అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు. సాక్షాత్తు జిల్లా అధికారులే కావడం విశేషం. వాస్తవానికి ఈనెల 5వ తేదీ సాయంత్రం మొదలైన వర్షం ఆదివారం రాత్రి వరకు కురిసింది. ఈ వర్షాలకు జిల్లా అతలాకుతలం అయ్యింది. నదులు, వాగులు పొంగిపొర్లాయి. దీంతో, జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నీటమునిగింది. పలుచోట్ల కాజ్‌వేలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. చెరువులకు గండ్లు పడ్డాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టరేట్ కార్యాలయమే చిన్నపాటి చెరువును తలపించింది. గదులు సైతం కారిపోవడంతో విధులకు ఆటంకం కలిగించింది. ఇలాంటి కష్టనష్టాలను గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారో...! లేక వాస్తవాలను దాచేందుకు ప్రయత్నించారో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

రూ.92.50లక్షల కాజ్‌వే గంగార్పణం

వేగావతి నీటి ఉధృతికి బొబ్బిలి మండలం పారాది కాజ్‌వే కొట్టుకుపోయింది. ఇప్పటికే అదే నదిపైవున్న వంతెన ప్రమాద స్థితిలోవుంది. అందువల్ల నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పుడు పలువాహనాలు ఈ కాజ్‌వే మీదుగా ప్రయాణం చేసేవి. ఇది ప్రస్తుతం కొట్టుకుపోవడంతో ఇక నుంచి ఆర్టీసి బస్సులు, వివిఐపి వాహనాలు సహా అన్ని వాహనాలు ఈ ప్రమాద స్థితిలోవున్న వంతెన మీద నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదం నుంచి కొంతలో కొంతైనా బయటపడేందుకు ఆరుమాసాల క్రితమే ఈ కాజ్‌వేను రూ.92.50లక్షలతో నిర్మించారు. ఇక నుంచి వాహనాలన్నీ వంతెన పైనుంచే ప్రయాణం చేయాల్సి పరిస్థితి రావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం పొంచివుంటుందోనని ఈ ప్రాంతవాసులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌తో నష్టమెంతో..!

పూసపాటిరేగ మండలం పూసపాటిపాలెంలో నీటి ఉధృతికి ఓ చెక్‌డ్యాం కొట్టుకుపోయింది. పూసపాటిరేగ, రెల్లివలస తదితర ఎగువ గ్రామాల నుంచి వచ్చే నీరు వృథాపోకుండా నిల్వచేసేందుకు చాలా ఏళ్ల క్రితమే దీన్ని ప్రభుత్వమే రూ.లక్షలు వెచ్చించి దీన్ని నిర్మించింది. ప్రస్తుత వర్షాలకు ఈ కల్వర్టు కొట్టుకుపోవడంతో ఇక నుంచి ఆ ప్రదేశంలో నీరు నిల్వవుండే అవకాశం కోల్పోయినట్టే. ఈ విధంగా ఇటు ప్రభుత్వ నిధులు వృథాకాగా, అటు రైతులకు సాగుకష్టాల రూపంలో నష్టం వాటిల్లనుంది.

వెన్ను విరిగినా పట్టించుకోని దుస్థితి

8వ తేదీన భారీగా కురిసిన వర్షాలకు విజయనగరంలోని రామకృష్ణానగర్‌లో ఓ ఇల్లు కూలిపోవడంతో బలగ లింగమూర్తికి నడుము విరిగిపోయింది. ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం అందకపోవడంతో బాధితుని కుటుంబ సభ్యులు అవస్థలు పడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీట మునగడంతో ప్రజలు నష్టపోయారు.

ఇవీ కంట్రోల్ రూం కహానీలు

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల కష్టనష్టాలు తెలుసుకునేందుకు పలు శాఖల అధికారులను ప్రజాశక్తి సంప్రదించగా వివరాలు చెప్పేందుకు నీళ్లు నమిలారు. దీంతో, వరదల సమయంలో జరిగిన నష్టాలను ఎప్పటికప్పుడు తెలుసు కునేందుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలోనూ కహానీలే వినిపించాయి. వరద నష్టాలను తెలుసుకునేందుకు తొలుత కలెక్టరేట్ ఎఒను సంప్రదించగా డి-సెక్షన్‌లో ఉంటాయని చెప్పారు. డిసెక్షన్ సూపరిండెంట్ వద్దకు వెళ్లే విపత్తుల నిర్వహణ అధికారి (డిపిఎం) వైపు వేళ్లు చూపించారు. డిపిఎం రాజేశ్వరి డిఆర్ఒ అనితపైకి నెట్టేశారు. ఆమె ఇంకా వివరాలు రావాల్సి వుందంటూ తేల్చారు. ఇలా వరద నష్టాల లెక్కలు ఏడు చేపలకథ మాదిరిగా మారిపోయింది.

వివరాలు

చెప్పకుండా విపత్తులు గుర్తింపా?

వరద నష్టాలపై నోరు మెదపని అధికారులు మంగళవారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకు అధికారులు, జిల్లా అధికారుల కమిటీ సమావేశం ప్రకృతి విపత్తుగా గుర్తించాలని కోరారు. ఈ మేరకు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశం తీర్మాణం చేయడం గమనార్హం. ఉద్యానవన పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, రోడ్లు, వంతెనలు, సాగునీటి వనరులు ధ్వంసమయ్యాయని, కోళ్లు, పశు సంపదలోనూ నష్టం జరిగిందని తీర్మానంలో పేర్కొన్నారు. నష్ట తీవ్రతను ఇటు జనానికిగానీ, అటు ప్రభుత్వానికిగానీ నివేదించ కుండా ఇలాంటి తీర్మానాలు ఏమేరకు మేలు చేకూరుస్తాయో అధికారులకే ఎరుక.

నీట మునిగిన వేల ఎకరాలు

అధిక వర్షాలు కురిసినచోట్ల, చెరువులు, వాగులకు గండ్లు పడినచోట పంటపొలాలు పూర్తిగా మునిగిపోయాయి. ముఖ్యంగా వేపాడలోని అనంత చెరువుకు గండిపడడంతో పొలాలన్నీ జలమయ మయ్యాయి. చెరువుకు దిగువన ఉన్న గ్రామాలకు నీరు పోటెత్తడంతో జనం అవస్థలు పడ్డారు. మడ్డువలస వరద ఉధృతికి వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో వేల ఎకరాల్లో నీటమునిగింది. ఇప్పటికీ ఆయా మండలాల్లో పంటపొలాల్లో నీరు తగ్గుముఖం పట్టలేదు. గుర్లలో 50ఎకరాలు, డెంకాడ, బొబ్బిలి తదితర మండలాల్లో ఎంతోకొంత పంట నీట మునిగి పోయింది. ఇంతే కాకుండా పలురోడ్లు కొట్లుకు పోయాయి. ఇలా చెప్పకుంటూ పోతే జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వానికి ఎంతో నష్టం జరిగింది. దీన్ని గుర్తించి, ప్రకటించడంలో అటు ప్రభుత్వానికి, ఇటు ప్రజలకు వారదిగావుండే అధికారులు విఫలమయ్యారు. కనీసం వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఎన్ని ఎకరాల్లో పంటలు నీటమునిగాయన్నది చెప్పడంలోనూ అలసత్వం ప్రదర్శించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పిఆర్, ఆర్అండ్‌బి, ఉద్యావన, రెవెన్యూ శాఖ అధికారులు కూడా ప్రజల కష్టనష్టాలపై నీరు మెదపడం లేదు.



కొట్టుకుపోయిన పారాది కాజ్‌వే



ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

విశాఖ ఉక్కును పరిరక్షించాలి

- ప్రైవేటీకరణ కాకుండా కూటమి నేతలు కేంద్రపై ఒత్తిడి తేవాలి
- స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి
- సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ, స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేపట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు హామీనిచ్చిందని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ మాట్లాడారు. రాష్ట్రానికి మణిహారంగా ఉంటూ ఉత్తరాంధ్ర అభివృద్ధికి తోడ్పాటు నందిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు. రూ.9వేల కోట్ల పెట్టుబడికి రూ.58 వేల కోట్ల డివిడెండ్ చెల్లించిన విశాఖ ఉక్కు పరిశ్రమను దొడ్డిదారిన ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని అన్నారు. ఇందులో భాగంగానే బ్లాస్ట్ ఫర్నేస్ రెండింటిని ఉద్దేశపూర్వకంగా మూసివేశారని, దీనివల్ల 75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం నుండి 30 లక్షల టన్నులకు స్టీల్ ఉత్పత్తి పడిపోనుందని తెలిపారు. దీంతో అనివార్యంగా నష్టాల్లోకి విశాఖ ఉక్కును నెట్టాలని బిజెపి ప్రభుత్వం భావిస్తోందన్నారు. రాష్ట్రానికి చెందిన ఎంపిల బలంపై ఆధారపడి నడస్తున్న కేంద్రప్రభుత్వం కూటమి నాయకులు ఒత్తిడి చేసి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునే ప్రకటనను కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేయించాలని డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో, 64 మంది ఎంపీల రాజీనామాలతో, 32వేల ఎకరాల రైతుల భూమిని సేకరించి నిర్మించుకున్న విశాఖ ఉక్కును వదులుకోవడానికి రాష్ట్రాల్లో ప్రజలు సిద్ధంగాలేరని, అవసరమైతే మరో పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, బి.సుధారాణి, జిల్లా కార్యదర్శి బి. సూర్యనారాయణ, నగర కార్యదర్శి బి.రమణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, ఆనంద్, నాయకులు రాజు, నాయుడు, గోవింద, శ్యామ్, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

6,7,8తేదీల్లో ఎపిటిఎఫ్ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

విద్యా రంగం అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 6,7,8 తేదీల్లో విజయనగరంలో జరుగనున్నాయని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి తెలిపారు. మంగళవారం జిల్లా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎపిటిఎఫ్ పోరాట ఫలితంగా విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేశామన్నారు. ప్రభుత్వాలు వేసిన అనేక కమిటీల సిఫార్సులను, పేద విద్యార్థులకు న్యాయం చేసే విధానాలను అమలు చేయలేదన్నారు. విద్యారంగంలో శాస్త్రీయ విద్యా విధానం కోసం, నైతిక విలువలతో కూడిన విద్యా విధానం అమలు చేయాలని, తెలుగు,ఆంగ్ల మాధ్యమం లో బోధన జరగాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్ అమలు చేయాలని, బడి బయట ఉన్న లక్ష మంది పిల్లలు బడిలో చేర్పించే విద్యా విధానం అమలు కోసం రాష్ట్ర మహాసభల్లో చర్చించి ప్రభుత్వాలకు సిఫార్సు చేయనున్నామని తెలిపారు. ఉపాధ్యాయులంతా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎ.సదాశివరావు, ఉపాధ్యక్షులు డి.ఈశ్వరరావు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వి పైడిరాజు, విద్యా పరిరక్షణ కమిటీ కో కన్వీనర్ కె.సత్యం, ఎన్. కూర్మారావు పాల్గొన్నారు.

కన్నీరు మిగిల్చిన వర్షాలు

వరి, మొక్కజొన్న పంటలకు నష్టం

ప్రజాశక్తి-బొబ్బిలి

భారీ వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చాయి. అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గం వ్యాప్తంగా అధిక వర్షాలు కురవడంతో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయలు పంటలకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు లెక్కల ప్రకారం.. బొబ్బిలి మండలంలో 33 ఎకరాల్లో వరి పంటకు, బాడంగి మండలంలో 12 ఎకరాల్లో పత్తిపంటకు, 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు, తెర్లాం మండలం కుసుమూరులో 13 ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిలినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. రామభద్రపురం మండలంలోని పూర్తిగా పంటలకు నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నారు. పెద్దగా పంట నష్టం జరగలేదని అధికారులు చెబుతున్నప్పటికి కూరగాయలు, మొక్కజొన్న పంటలకు అధికంగా నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఎం.పనుకువలసలో వరిచేనులో ఇసుక మేటలు

పంట నష్టంపై ప్రాథమిక అంచనా

పంట నష్టంపై ప్రాథమిక అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందర్ తెలిపారు. పంట పొలాల నుంచి వరదనీరు బయటకు వెళ్లిన తర్వాత పూర్తి స్థాయిలో పంట నష్టంపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు.

మొండి బకాయిలపై దృష్టి సారించండి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి ఇతర పన్నుల మొండి బకాయిలను రాబట్టేందుకు నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ప్రత్యేక దృష్టి సారించారు. రెవెన్యూ అధికారులకు సిబ్బందికి లక్ష్యాలను నిర్దేశించారు. సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావును ప్రత్యేకంగా మొండి బకాయిలు రాబట్టేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సహాయ కమిషనర్ మొండి బకాయిలు ఉన్న విద్యా, వాణిజ్య సంస్థలకు వెళ్లి పన్నులను తక్షణమే చెల్లించాలని స్పష్టం చేయగా, తక్షణమే చెల్లించేందుకు అంగీకరించారు. మరి కొంతమంది కొద్ది రోజులు గడువు కావాలని కోరగా ఒకటి రెండు రోజులు మినహా గడువు ఇచ్చే ప్రసక్తే లేదని సహాయ కమిషనర్ తేల్చి చెప్పారు. దీంతో వారు కూడా పన్నులు చెల్లించేందుకు సమ్మతించారు. కొత్త, పాత దుకాణ సముదాయాలలో దీర్ఘకాల అద్దె బకాయిలను రాబట్టేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేస్తున్నారు. దీర్ఘకాల మొండి బకాయిలను సహించబోమని కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు.

వరద బాధితులకు మేము సైతం

కాపు శంభాం హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు ...చుక్కవలస స్కూలు చిన్నారుల విరాళాలు

ప్రజాశక్తి-గరివిడి

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని కాపు శంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు విరాళాలు అందజేసి పెద్ద మనసు చాటుకున్నారు. వరద భీభత్సంతో విజయవాడ వాసులకు జరిగిన నష్టాన్ని చూసి చలించి పోయిన చిన్నారులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తాము కూడా వారి కష్టాల్లో పాలుపంచుకోవాలని భావించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విరాళాల బాక్సులో తమకు తోచిన ఆర్థిక సాయాన్ని అందులో వేశారు. విద్యార్థులంతా తాము దాచుకున్న పొదుపు డబ్బుల నుండి కొంత మొత్తాన్ని ఇచ్చి తమ ఉదారతను చాటుకున్నారు. మేము సైతం అంటూ అంగన్ వాడీ చిన్నారులు, సిబ్బంది కూడా ఇందులో పాలుపంచుకున్నారు. సుమారు నాలుగువేల రూపాయలు నిధిని సమకూర్చి తమ సేవా భావాన్ని తెలియజేసారు. ఈ మొత్తాన్ని వరద బాధితులకు అందజేస్తామని పాఠశాల హెచ్ఎం డి.రాము తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్లా సింహాచలం, కె.గోపాలకృష్ణ, బి. పావని, కె.జనార్దన్‌రావు, కె.మోహన్ కృష్ణ, జి.వి శ్రీదేవి, పి.ప్రకాష్ రావు, పి.పార్వతి, ఎం.పద్మజ, ఎ.నిర్మలాకుమారి, పెద్ది శ్రీను, బుద్దగురు యోగ, అంగన్వాడీ సిబ్బంది రఘుమండ రూప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం చుక్కవలస ఎంపియుపి స్కూలు విద్యార్థులు పెద్దమనసుతో విరాళాల రూపంలో రూ. 2090 వసూలు చేసి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిదికి పంపినట్లు హెచ్ఎం తెలిపారు.



కాపు శంభాం జెడ్‌పి హైస్కూలులో డబ్బాలో విరాళం వేస్తున్న విద్యార్థులు

సిఎం సహాయనిధికి పలువురు విరాళాలు

విజయనగరంకోట : వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని పలువురు స్పందించి విరాళాలు ఇస్తున్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి చెందిన 30మంది రెగ్యులర్ ఉద్యోగులు తమ ఒకరోజు జీతాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఈ మేరకు రూ.1,45,730ల మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. విజయనగరానికి చెందిన కిలపర్తి అప్పారావు విరాళంగా ఇస్తున్న రూ.25 వేలు మొత్తానికి సంబంధించిన చెక్కును, పున్నయ్యచెట్టియార్ విరాళంగా ఇస్తున్న రూ.10 వేలు మొత్తానికి చెందిన చెక్కును ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కలెక్టర్‌కు అందజేశారు.

అత్యాచార నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

గంట్యాడ పోలీసు స్టేషను పరిధిలో 2018లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడు గంట్యాడ మండలం కరకవలస గ్రామానికి చెందిన మద్దిల మురళీకి విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎన్.పద్మావతి పదేళ్ల జైలు శిక్ష, రూ. 35 వేలు జరిమాన విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారని ఎస్‌పి వకుల్‌జిందాల్ తెలిపారు. కరకవలస గ్రామానికి చెందిన నిందితుడు మద్దిల మురళీ అదే గ్రామానికి చెందిన మహిలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మోసం చేసి, అత్యాచారానికి పాల్పడినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో గంట్యాడ పోలీసు స్టేషనులో 2018లో కేసు నమోదైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నిందితుడు మురళీ అత్యాచారానికి పాల్పడినట్లు నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని తెలిపారు. కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్షపడేలా వ్యవహరించిన దర్యాప్తు అధికారులను ఎస్‌పి అభినందించారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని విజయనగరం, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీసు స్టేషన్ల పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తమ అవసరాల నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో తమ ఇండ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్. (లాక్డ్ హౌస్ మోనటరింగు సిస్టం) సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పి వకుల్ జిందాల్ కోరారు. దొంగతనాల నియంత్రణకు రాష్ట్ర పోలీసుశాఖ లాక్డ్ హౌస్ మేనేజెమెంట్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్)ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడం వలన ఇల్లు విడిచిపెట్టి బయట ప్రాంతాలకు వెళ్లే సమయాల్లోనే ఎక్కువగా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఈ మొబైల్ యాప్ సేవలు విజయనగరం 1వ, 2వ, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలోని కార్పొరేషను, మున్సిపల్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి అందుబాటులో ఉందన్నారు. ఈ మొబైల్ యాప్ వినియోగం వలన ప్రజల ఆస్తుల రక్షణకు కవచంలా పని చేస్తుందన్నారు. ఈ పోలీసు స్టేషను పరిధిలోని ప్రజలెవరైనా తాము ఇల్లు విడిచి తమ స్వంత అవసరాలు లేదా పనులు లేదా ఉద్యోగరీత్యా లేదా ఏదైన ఇతర కారణాల వలన బయట ప్రాంతాలకు వెళ్తున్నట్లుగా సంబంధిత పోలీసు స్టేషనుకు ముందస్తు సమాచారాన్ని అందిస్తే పోలీసులు ఎల్.హెచ్.ఎం.ఎస్. సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారన్నారు. ఇందుకుగాను వారు తమ స్మార్ట్ ఫోనులో గూగుల్ ప్లే స్టోర్ నుండి ఎల్.హెచ్.ఎం.ఎస్.యాప్ ను డౌన్‌లోడు చేసుకొని, ఇంటి నుండే తమ పేరు, ఫోను నంబరు, లొకేషను వంటి ఇతర వివరాలను, ఎల్.హెచ్.ఎం.ఎస్. సేవలను ఎప్పటి నుండి ఎప్పటి వరకు పొందాలని అనుకుంటున్నారన్న విషయాలను యాప్‌లో నమోదు చేసి, రిక్వెస్ట్ పంపాలన్నారు. ఆ తరువాత వారి మొబైల్ నంబరుకు ఒక రిజిస్ట్రేషను నంబరు వస్తుందని, ఈ నంబరునే యూజర్ ఐడిగా పొందవచ్చునన్నారు. ఇలా రిక్వెస్టు పంపిన తరువాత సంబంధిత పోలీసు స్టేషను నుండి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి, సిసి కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా ఇళ్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇంటి పరిసరాలలోకి ప్రవేసించిన వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం చేరవేస్తూ, అలారం మోగుతుందన్నారు. దీనితో పోలీసులు అప్రమత్తమై, సంబంధిత పోలీసు స్టేషనుకు సమాచారం అందించి, దొంగతనాలు జరగకుండా నులువుగా నియంత్రించడంతో పాటు, నిందితులను కూడా పట్టుకోవచ్చునని తెలిపారు.

75వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి అనుమతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

సువర్ణముఖి నది వద్ద 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకానికి ప్రభుత్వం నుండి అన్ని రకాల అనుమతులు లభించాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక తవ్వకానికి 11 ఏజెన్సీలు దరఖాస్తులు అందజేశాయని,ఈ ఏజెన్సీల సామర్థ్యాన్ని తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు కలెక్టర్ సూచించారు. వారి వద్ద నున్న మెషినరి, యంత్రాలు, ఇన్ఫ్రా, రోజుకు ఎన్ని క్యూసెక్కులు తవ్వగల సామర్థ్యం ఉన్నదీ తదితర అంశాలను తనిఖీ చేయాలని తెలిపారు. వంగర మండలం కొండచాకరపల్లి వద్ద స్టాక్ పాయింట్ పెడితే జిల్లాకు దూరంగా ఉంటుందని, వెళ్లే రహదారి కూడా సింగల్ కావడం లారీలకు ఇబ్బందికరంగా ఉంటుందని, పర్యవేక్షణ కూడా పక్కాగా ఉండదని,ఇసుక వినియోగదారులకు అసౌకర్యంగా ఉంటుందని భావించి బొబ్బిలి లేదా రామభద్రపురంలో స్టాక్ పాయింట్ పెట్టడానికి ప్రభుత్వ స్థలం గుర్తించాలని బొబ్బిలి ఆర్‌డిఒకు సూచించారు. ఆ మేరకు జిల్లా స్థాయి కమిటీలో తీర్మానం చేసారు. నూతన ఇసుక విధానం లో సాంకేతికత ద్వారా పారదర్శకంగా ఉండేలా ఆన్లైన్ ప్రాసెస్ లోనే జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం ఒక ఐటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రెండు మొబైల్ ఫోన్లు, ప్రింటర్, సిసి కెమెరా తదితర వాటిని స్టాక్ పాయింట్ వద్ద సిద్ధంగా ఉంచాలని తెలిపారు. సమావేశంలో జెసి సేతు మాధవన్ , ఆర్‌డిఒలు సూర్యకళ , సాయి శ్రీ, శాంతి, ఉప రవాణా కమిషనర్ మణి కుమార్, మైన్స్ డిడి సూర్యచంద్రరావు, డిపిఒ శ్రీధర్ రాజా, డిఎస్‌పి గోవిందరావు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ జాతర ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

పైడితల్లి అమ్మవారి దేవస్థానానికి చెందిన నూతన ప్రచార రథాన్ని అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి పండుగ విశిష్టత ను తెలుపుతూ ప్రచారం చేసేందుకు నూతన రథాన్ని ప్రారంభించనట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు హాజరయ్యే పైడితల్లి అమ్మవారి పండగను 2017లో టిడిపి ప్రభుత్వం రాష్ట్ర పండగగా గుర్తించిందన్నారు. విజయనగరం ఉత్సవాలను కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డివివి ప్రసాదరావు, ఆలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో డెంగీ కేసులు తగ్గుముఖం

ప్రజాశక్తి - వంగర

డెంగీ కేసులు గతేడాదితో పోలిస్తే జిల్లాలో భారీగా తగ్గుముఖం పట్టాయని జిల్లా వైద్యాధికారి ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 132 డెంగీ కేసులు మాత్రమే వచ్చాయన్నారు. ఆరోగ్య సేవలు సక్రమంగా అందటమే దీనికి ప్రధాన కారణమన్నారు. స్థానిక మండల కేంద్రంలో గల ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగీ మరణాలు జిల్లాలో ఎక్కడా లేవని వెల్లడించారు. ఆరోగ్య సిబ్బంది ఈనెల 1వ తేదీ నుంచి ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని రోజుకు సుమారు 1250 మంది సాధారణ జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. మండలంలోని అరసాడలో ఆరోగ్య నూతన భవనానికి సంబంధించి ఇప్పటికే రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒక ఎకరం స్థలం సమకూర్చినట్లు చెప్పారని త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని అన్నారు. ముందుగా ఆరోగ్య కేంద్రంలోని మందుల గదులు, రక్త పరీక్ష గది, ఆసుపత్రి అంతటను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అక్కడ వైద్యులు సుస్మిత దయానా, జ్యోతితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులు అర్ధరాత్రి వేళ వచ్చి తలుపు తట్టిన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అక్కడ అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య బృందం చంద్రశేఖర్ రాజు, అనిల్ ప్రేమ్ కుమార్, సత్తిరాజు, వంగర వైద్య సిబ్బంది సురేష్, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలు పై ఇంటింటి సర్వే

కొత్తవలస: తుపాను కారణంగా నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు డైయేరియా, డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి సిబ్బంది గ్రామాలలో సర్వే నిర్వహించినట్లు డాక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. ముసిరాం, వీరభద్రపురం, అప్పన్నపాలెం, ఉత్తరపల్లి, రామలింగాపురం గ్రామాలలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి, వేడి ఆహార పదార్థాలు తినాలని తెలిపారు. నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. మాంసం, చేపలు, గోంగూర, బిర్యానీ వంటి నిల్వ ఆహార పదార్థాలు తినరాదన్నారు. గోలేలు, కుండీలు, కడిగి ఆరబెట్టుకోవాలని, టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు ఇళ్ల ముందు ఉంచరాదని అన్నారు. డెంగీ దోమలు మంచి నీటిలోనే పెరుగుతాయని, పగలే కుడతాయని చెప్పారు. ఎమ్ఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎమ్స్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశ వర్కర్స్ నీటి నిల్వలు గుర్తించి దోమలు లార్వాని ఎలిమినేట్ చేస్తున్నామన్నారు. వాటర్ ట్యాంక్స్, నూతులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో క్లోరినేషన్ చేయించినట్లు తెలిపారు.

డిఎంహెచ్ఒ భాస్కరరావు



వంగర: రోగి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రామభద్రపురం: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇటువంటి తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ రమామణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆరికతోట, రామభద్రపురం పిహెచ్‌సి వైద్య సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఉన్న కాలువల్లో బ్లీచింగ్ చల్లాలని, క్లోరినేషన్ కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని అన్నారు. అపారిశుధ్యం నిర్మూలనకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ప్రజలకు వైద్య సిబ్బంది ఆరోగ్య సలహాలు ఇవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆరికతోట పిహెచ్‌సి ఇఒ మల్లీశ్వరరావు, రామభద్రపురం పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ నడిమింటి వాసుదేవరావు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చొక్కాపు శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

48 మంది గర్భిణులకు తనిఖీలు

వేపాడ: స్థానిక పిహెచ్‌సిలో పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 48 మంది గర్భిణులకు డాక్టర్ ధరణి తనిఖీలు నిర్వహించారు. ఉచితంగా ల్యాబ్ పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ ధరణి, గైనకాలజిస్ట్ ఎస్. ఫణిశ్రీ వివరించారు. అనంతరం బానాది సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న రెడ్డి శంకరరావు

నివాసమున్న చోటే ఇళ్లు కట్టివ్వాలి : సిపిఎం

విజయనగరంటౌన్: పేదలు నివాసమున్నచోటే పక్కాఇల్లు కట్టి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. మంగళవారం విజయనగరం ఎల్‌బిజి నగర్ శాఖ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని అన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఎల్‌బిజి నగర్ చుట్టూ ఉన్న కాలనీలన్నింటికీ కలిపి అంగన్ వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని, అర్బన్ హెల్త్‌సెంటర్లలో డాక్టర్లు, స్టాఫ్‌ను తగినంతమందిని నియమించాలని, కేంద్రాస్పత్రిలో హార్ట్, యూరాలజీ, న్యూరాలజీ, కేన్సర్ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు వేయాలనే ప్రతి పాదన విరమించుకోవాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ, నగర నాయకులు బి.రమణ, శాఖ కార్యదర్శులు కృష్ణమ్మ, పుణ్యవతి పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలి

రామభద్రపురం: గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సచివాలయ మహిళా పోలీసులు(ఎంఎస్‌పి)లు భాగస్వామ్యం కావాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎంఎస్‌పిలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయని త్వరలో నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నాయని వీటిలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోలీసు అనుమతులు లేకుండా చేసే అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి శాంతి యుతంగా నిమజ్జనం జరిగేలా చూస్తూ పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో స్టేషన్ సిబ్బంది వివిధ సచివాలయాల ఎంఎస్‌పిలు పాల్గొన్నారు.

కాలువలు, రోడ్లు శుభ్రం చేయాలి

బొబ్బిలి: కాలువలు, రోడ్లు శుభ్రం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళిని మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని నాయుడుకాలనీ, ఇందిరమ్మకాలనీలో మంగళవారం పర్యటించారు. కాలువలలో పూడికలు, రోడ్లపై మట్టి, చెత్త ఉండడంతో తక్షణమే శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాలు కారణంగా కాలువలలో పేరుకుపోయిన పూడికలు, రోడ్లపై ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఆమెతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

18,19న మండల స్థాయి స్కూల్ గేమ్స్

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం ఉన్నత పాఠశాలలో ఈనెల 18, 19వ తేదీలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్లు విద్యాశాఖాధికారులు ఎ.రాజ్‌కుమార్, బి. పావునాయుడు తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అండర్ 14, 17 కేటగిరీలో బాలురు, బాలికలకు ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగ వంటి క్రీడాంశాలలో ఈ పోటీలు జరుగు తాయన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు.

నీలకంఠరాజపురంలో ఫుడ్ ఎగ్జిబిషన్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురంలో మంగళవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికాహారంపై ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలను తినాలని, ఆకుకూరలు తీసుకోవాలని సూపర్ వైజర్ తెలిపారు బాలామృతంతో బిస్కెట్లు, కేకులు, సోడి పిండితో జున్ను, అట్టు, పకోడీ, ఆకుకూరతో చపాతీలు, మొలకెత్తిన పెసలు, చిరుధాన్యాలు తెలగపిండి వడియాలు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నాగమణి, జె.రమాబాయి, బి.సూర్యకుమారి, కె.సత్యవతి, డి.వి.రమణమ్మ, ఎస్.పి సీతారత్నం, ఆశాజ్యోతి, ఆయాలు, బాలింతలు పాల్గొన్నారు.

సోంపురం పాఠశాల పరిశీలన

వేపాడ: మండలంలోని సోంపురం, జగ్గయ్యపేట ప్రాథమిక పాఠశాలల్లో ఎంఇఒ పి.బాల భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. ముందుగా పాఠశాల పరిసర ప్రాంతాలు, తరగతి గదులు, టాయిలెట్స్, వంటగదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలన, తెలుగు, ఇంగ్లీష్ పాఠాలు టెక్స్ట్ బుక్‌లోని చదివించడం, విద్యార్థులతో రాయించడం, చతుర్విధ ప్రక్రియలు పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో పాఠశాల హెచ్ఎంతో పాటు, సిఆర్‌పి కూడా పాల్గొన్నారు.

శిథిల భవనాలకు దూరంగా ఉండండి

వేపాడ: వర్షాలు నేపథ్యంలో శిథిల భవనాలకు విద్యార్థులను దూరంగా ఉంచాలని డిఇఒ ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలకు విద్యార్థులను వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు వేడివేడిగా తగిన పోషక విలువలతో అందించాలన్నారు. భోజనంతో పాటు వేడి నీరు కూడా ఇవ్వాలన్నారు. యుడైస్ ప్లస్ జనరల్ ప్రొఫైల్ నింపినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు అందుకున్న దళ్లిరాజుపేట ప్రధానోపాధ్యాయులు రెడ్డి శంకర్రావుకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

14న మెగా లోక్ అదాలత్

శృంగవరపుకోట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కమ్ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 14వ తేదీన మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. సూరిదేముడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, సివిల్, క్రైం కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలని కోరారు. న్యాయవాదులందరూ కక్షిదారులను లోక్ అదాలత్‌కు హాజరయ్యేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి బి. సత్యనారాయణ, సహా కార్యదర్శి యల్.అప్పారావు, కోశాధికారి బి.త్రిమూర్తులు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు జి.ప్రకాశరావు, యమ్.దొరబాబు, ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలు ఇవ్వాలి

శృంగవరపుకోట: పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను చెల్లించాలని ఎస్‌కోట మేజర్ పంచాయతీ ఇఒ అనూరాధకు జనసేన ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ నాయకుడు వబ్బిన సత్యానాయుడు మాట్లాడుతూ బడుగుల గ్రీన్ అంబాసిడర్లకు 2019లో 9నెలకు 2020లో 6నెలలు, 10నెలది 2022లో జనవరి, ఫిబ్రవరి, మార్చి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 56 మంది స్వీపర్లకు సమానంగా పని అప్పగించి పనిభారం తగ్గించాలని కోరుతూ ఇఒకు వినతినిచ్చారు. అనంతరం ఎంపిడిఒ ఆఫీసులో ఇఒపిఆర్‌డికి సమస్యలు పరిష్కరించమని కోరిన గ్రామ పంచాయతీ నిధుల నుండి పలు దఫాలుగా వేతన బకాయిలు చెల్లించాలని ఇఒకు ఆదేశిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

శ్రీరంగ రాజపురంలో పొలంబడి

గజపతినగరం: మండలంలోని శ్రీరంగ రాజపురంలో మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు కె. మహారాజన్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతు ఇబ్బరోతు శంకర్రావు పొలాన్ని సందర్శించి ప్రస్తుత వాతావరణ పరిస్థితిలో పొడ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. డ్రోన్ సహాయంతో ఎరువులను స్ప్రే చేయడం వల్ల కలిగే లాభాలను వివరించి వరిలో సోకుతున్న పొడ తెగులు, ఆకుముడత పురుగు నివారణకు ప్రొపికొనజోల్, ఎసిఫెట్ మందులను ఆ రైతు పొలంలో డ్రోన్ సహాయంతో స్ప్రే చేసి ఆచరణలో చూపించారు. ఈ కార్యక్రమంలో ఎ. సి. హెచ్ ధనలక్ష్మి, వ్యవసాయ సహాయకులు వినయ్ కుమార్, తెలుగు నాడు ఎఫ్‌పిఒ చైర్‌పర్సన్ భారతి, సిఇఒ ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ భవనం నిర్మించాలి

విజయనగరం కోట: జిల్లాలో బిసి సామాజిక వర్గం భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెల్ల శ్రీనివాసరావు కోరారు. మంగళవారం అలాకా నంద కాలనీలోని ఆ సంఘ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు హయంలో జిల్లాలో బిసి భవన్ నిర్మాణం కోసం స్థలం మంజూరు చేశారని, ఈ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు.

కేసు ఎలా నమోదు చేస్తారు?

- కండక్టర్‌పై కేసు నమోదుతో స్క్వాడ్‌పై తిరగబడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి - భోగాపురం

ఆర్‌టిసి బస్సులో టికెట్లు తనిఖీ సమయంలో ఒక చిన్నారి వయసు వ్యవహారంలో కండక్టర్‌పై కేసు నమోదు చేసిన ఇద్దరు స్క్వాడ్ అధికారులపై ప్రయాణికులు తిరగబడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రయాణికులు చివరకు బస్సును నిలిపివేసి పోలీస్ స్టేషన్‌లో పంచాయితీ పెట్టారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్ళే పల్లె వెలుగు బస్సులో చోటు చేసుకుంది. విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న శ్రీకాకుళం డిపో -1 కు చెందిన పల్లె వెలుగు బస్సు విశాఖ నుంచి బయలుదేరింది. ఇంతలో పోలిపల్లి వద్ద టికెట్లు తనిఖీ చేసే స్క్వాడ్ బస్సును ఆపి తనిఖీలు చేశారు. ఇంతలో పైడిబీమవరం వెళ్తున్న మహిళ తన కుమారుడ్ని వేరేవాళ్ళ ఒడిలో కూర్చో పెట్టింది. స్క్వాడ్ టికెట్ అడిగే సమయంలో టికెట్ తీసుకోలేదని బాబు వయసు ఐదేళ్లు అని చెప్పింది. దీంతో ఆమె వద్ద టికెట్ లేదని స్క్వాడ్ కండక్టర్‌పై కేసు నమోదు చేసి చెక్ లిస్టుపై సంతకాలు చేయాలని పట్టుబట్టారు. దీంతో బాబు తల్లి తేరుకొని తన కుమారుడి వయసు ఐదేళ్లు కానీ టికెట్ తీసుకోలేదని స్క్వాడ్ అధికారులకు మళ్ళీ చెప్పింది. ఏదో తప్పుగా చెప్పిందని తోటి ప్రయాణికులు చెప్పినప్పటికీ చెక్ లిస్టుపై సంతకం పెట్టాలంటూ కండక్టరుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రయాణీకులందరు స్క్వాడ్‌పై తిరగబడ్డారు. తల్లి చెప్పింది వినాలంటు వారికి నచ్చజెప్పినప్పటికి వారు వినలేదు. దీంతో వెంటనే భోగాపురం పోలీస్ స్టేషన్ వద్ద బస్సును ప్రయాణికులు నిలిపివేసి పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కండక్టర్, స్క్వాడ్ అధికారుల మధ్య వివాదం జరిగింది. చివరకు సిఐ ప్రభాకర్, ఎస్.ఐ సూర్యకుమారి జోక్యం చేసుకొని జరిగిన సంఘటనను అడిగి తెలుసుకున్నారు. బాలుడి తల్లి టికెట్ అడిగే సమయంలో నాలుగేళ్ళని చెప్పడంతో తాను టికెట్ ఇవ్వలేదని, కాని స్క్వాడ్ అడిగేటప్పుడు ఐదేళ్లు అని చెప్పడంతో ఇదంతా జరిగిందని రాసుకుని చెక్ లిస్టుపై కండక్టర్ సంతకం పెట్టినా ఏమి కాదని స్క్వాడ్ అధికారులు చెప్పడంతో చివరకు ఇరువురిని పోలీసులు పంపించేశారు.



వివరాలను పోలీసులకు చెబుతున్న ప్రయాణికులు

మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరంకోట : ఎన్‌టిఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రంలో అర్హులైన ఆసక్తి కలిగిన నిరుద్యోగ మహిళా యువతులు, గృహిణుల నుండి శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ విమల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులను ఈనెల 17 నుంచి ప్రారంభి స్తామన్నారు. సూయింగ్ మెషిన్ ఆపరేటర్, బ్యూటీషియన్, మగ్గంవర్కు కోర్సులకు శిక్షణ ఉంటుందని 18 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు మధ్య వారు అర్హులని, ఈనెల 13వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి

విజయనగరం కోట: విజయనగరం ఆర్‌టిసి డిపో పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - గజపతినగరం

బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని స్థానిక ఐసిడిఎస్ పిఒ నాగమణి అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం అంగన్వాడి వర్కర్లకి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మగవాళ్ళకి 21, ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు. తక్కువ వయస్సులో వివాహం చేస్తే 1098 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వల్ల శరీరం సహకరించకపోగా, తక్కువ వయసున్న పిల్లలు జన్మించే అవకాశం ఉంటుందన్నారు. ఒక్కోసారి ప్రాణాపాయ స్థితి కూడా ఏర్పడుతుందన్నారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రథమంగా అంగన్వాడి వర్కర్లు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాల్యవాహాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొండపల్లి: నాగరికత పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుతుండడం చాలా భాదాకరమని బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని గంట్యాడ సిడిపిఒ డి.ఉమాభారతి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌పిలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉమాభారతి మాట్లాడుతూ మేనరికం, దగ్గరి సంబంధం తదితర బందాల ముసుగులో వధూవరులకు వివాహ వయస్సు రాకుండానే పెళ్లి చేస్తున్నారన్నారు. వివాహ నిర్ణీత వయస్సుపై తల్లితండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా బాల సంరక్షణ విభాగం ప్రతినిధి సరస్వతి, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ఆర్.శ్రీనివాసరావు తదితరులు బాల్య వివాహాలు నష్టాలపై వివరించారు. అనంతరం పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ జానకి, కృష్ణవేణి, ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిఒ నాగమణి

ముంపు నియంత్రణ చర్యలేవి? : మంత్రి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

పంట ముంపునకు, రోడ్లు గండి కొట్టడానికి కారణమైన ఇక్కడ పరిస్థితులను చూస్తుంటే గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోపాటు, అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షానికి గడసాం గ్రామ సమీపంలో గండి కొట్టిన రోడ్డును మంగళవారం సాయంత్రం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆర్ అండ్ బి, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. కల్వర్టు నిర్మాణం చేపట్టేటప్పుడు వాటర్ ఫ్లోయింగ్ అంచనాల మేరకు కల్వర్టు ఎస్టిమేషన్ వేసి, ఆర్అండ్‌బి అధికారులతో సమన్వయం చేసుకొని నిర్మాణం చేపట్టాలి కదా? అని ప్రశ్నించారు. నిర్మాణం చేపట్టేటప్పుడు ఆర్ అండ్ బి, అధికారులు తెలియజేయలేదని ఇరిగేషన్ అధికారులు అనడంతో సమన్వయ లోపం కారణంగా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని మంత్రి మండిపడ్డారు. కల్వర్టుకు అదనంగా మధుములు పెంచి, రోడ్డు మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టేందుకు అంచనాలు వేయాలని ఆదేశించారు. పంట నష్టం అంచనా వేయాలని ఏవో అనురాధకు సూచించారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

భోగాపురం: మండలంలోని చెరుకుపల్లి, లింగాల వలస గ్రామాల్లో నీట మునిగిన వరి పంటను టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు మంగళవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువల్లోని నీరు పొంగి పంట పొలాలు ముంచేశాయి. రైతుల ఆందోళన చెందుతున్న నేపథ్యంలో చెరుకుపల్లి గ్రామానికి చెందిన మండల తెలుగు యువత అధ్యక్షులు తోగులు రెడ్డి పంటలను పరిశీలించాలని కోరారు. దీంతో సుమారు 48 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్లు ఎఒ హరికృష్ణ బంగార్రాజుకు తెలియజేశారు. కాల్వలకు సంబంధించిన మధుములను కప్పి పంట పొలాల్లోనే నీరు బయటకు వెళ్లే విధంగా చూడాలని నీటి పారుదల శాఖ అధికారులతో బంగార్రాజు మాట్లాడారు. రైతులు నష్టపోకుండా నీటిని తరలించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎఒ హరికృష్ణ మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో నీరు క్రమేపి తగ్గుతుందని తెలిపారు. నీరు తగ్గిన తర్వాత బూస్టర్ డోస్ కింద ఎకరానికి 25 కేజీలు పొటాస్, 25 కేజీలు యూరియా వేసుకోవాలని రైతులకు సూచించారు.

సిఎం సహాయ నిధికి విరాళం

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయవాడ వరద బాధితుల కోసం పెద్ద ఎత్తున విరాళాలు ఇస్తున్నారు. శ్రీలక్ష్మీ మెడికల్ ఏజెన్సీస్ అధినేత, బొబ్బిలి మున్సిపాలిటీ టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు రూ.50వేలు, డాక్టర్ గుల్ల రామ్‌నరేష్ రూ.50వేల చెక్కులను ఎమ్మెల్యే బేబినాయనకు సోమవారం అందించారు.

గజరాయనివలస ఎంపిటిసి పాలవలస గౌరు వరద బాధితుల సహాయార్థం రూ.10వేలు నగదును ఎమ్మెల్యే బేబినాయనకు అందించారు.

వేపాడ: ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవాడ వరద బాధితులకు రూ.1లక్ష విరాళం సిఎం చంద్రబాబుకు అందించామని బక్కునాయుడుపేట పాఠశాలలో పనిచేస్తున్న ఆ యూనియన్ రాష్ట్ర ట్రెజరరీ ఎ. రవికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నగదును సిఎంకు అందించినట్లు ఆయన వెల్లడించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న సిమెంట్, ఐరన్ విద్యుత్ స్థంబాలు వెంటనే మార్చాలని, లో ఓల్టేజ్ విద్యుత్ సరఫరా మెరుగు పర్చి ట్రాన్స్ ఫార్మర్ మార్చడానికి చర్యలు తీసుకోవాలని సబ్ స్టేషన్ ఎఇని కోరారు. ఈ సమావేశంలో కమిషనర్ టి వి ఎస్ విశ్వేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సరోజిని

మా సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - వేపాడ

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మారిక గ్రామానికి చెందిన గిరిజనులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి తన నివాసంలో మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, తాగునీటి సమస్య కూడా ఉందని చెప్పారు. ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తారని చెప్పడమే తప్ప తమకు ఇంటింటి తాగునీటి కొళాయిలు మాత్రం ఏర్పాటు చేయలేదని ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మీ సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరకవలస పంచాయతీ టిడిపి నాయకులు, గిరిజన టిడిపి నాయకులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల

రత్నకుమార్‌పై చర్యలు తీసుకోవాలి : ఆర్ఎస్ జాన్

విజయనగరం కోట: సిబిసిఎన్‌సి సంస్థ ఆస్తులను అక్రమంగా విక్రయిస్తున్న ఎం.రత్నకుమార్ ను తొలగించాలని సిబిసిఎన్‌సి ఆస్తుల పరిరక్షణ కమిటీ సంఘమిత్ర ఆర్ఎస్ జాన్ డిమాండ్‌చేశారు. క్రైస్తవ, మైనార్టీ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం చేయాలన్నారు. మంగళవారం స్థానిక సిమ్స్ చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో జాన్‌తో పాటుగా ఏడు జిల్లాల ఫాదర్స్ మాట్లాడారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఎం.రత్న కుమార్ 2010లో దాసరి యాకూబ్ అనే వ్యక్తి ప్రోద్భలంతో సిబిసిఎన్‌సి అధ్యక్షుడిగా వచ్చారన్నారు. రత్న కుమార్‌పై 20కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. ఈయన బొబ్బిలిలో భూ బదలాయింపు కింద తూముల భాస్కర్ రావు అనే వ్యక్తికి సిబిసిఎన్‌సి స్కూల్ ఆస్తులను బదలాయింపు చేయడం చట్ట విరుద్ధమన్నారు. విజయనగరంలో సిబిఎం యూపి స్కూల్ స్థల విక్రయ విషయంలో క్రిమినల్ కేసులు పెట్టారని తెలిపారు. ఇన్ని క్రిమినల్ కేసులున్న ఆయనను బొబ్బిలి స్కూల్ కరస్పాండెంట్‌గా డిఇఒ ఎలా కొనసాగిస్తున్నారో అర్థం కావడంలేదన్నారు. దీనిపై త్వరలోనే అన్ని సంఘాలు ఏకమై పోరాటం చేస్తామన్నారు. నగరంలో సిమ్స్ చర్చి 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

సొంత నిధులతో జంగిల్ తొలగింపు

చీపురుపల్లి: వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తన సొంత నిధులను వెచ్చించి రోడ్డునకు ఇరువైపులా ఉన్న మొక్కలను (జంగిల్ క్లియరెన్స్) జెసిబితో తొలగించే కార్యక్రమాన్ని మండలంలో మంగళవారం చేపట్టారు. మండలంలో అలజంగి, మెట్టపల్లి, సంకుపాలెం వరకు రోడ్డుకి ఇరువైపులా మొక్కలు, తుప్పులు పెరిగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో ఆ రోడ్డునకు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు చీపురుపల్లి జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా భర్త శ్రీనివాస నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డుకు ఇరువైపులా సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఉన్న మొక్కలను, తుప్పలను జెసిబితో తొలగించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మెట్టపల్లి మాజీ సర్పంచ్ చందక శ్రీనివాసరావు, ఎంపిటిసి మీసాల ఈశ్వరావు, రేవల్ల సత్తిబాబు, కుమార్, రాము, ప్రభాత్, సత్యం, దుర్గారావు పాల్గొన్నారు.

సిబిఎం పాఠశాల రిజిస్ట్రేషన్‌పై దర్యాప్తు

బొబ్బిలి: సిబిఎం బాలికోన్నత పాఠశాల రిజిస్ట్రేషన్‌పై తహశీల్దార్ ఎం.శ్రీను మంగళవారం దర్యాప్తు చేశారు. సిబిఎం పాఠశాల స్థలం తొమ్మిది నెలల క్రితం స్థలం మార్పిడి కింద రిజిస్ట్రేషన్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వామపక్షాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేయడంతో తహశీల్దార్ పాఠశాలను సందర్శించి ప్రధానోపాధ్యాయరాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ పై పూర్తి వివరాలు తెలుసుకుని జిల్లా అధికారుల ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయనతో ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, సర్వేయర్ సతీష్ ఉన్నారు.

సచివాలయాల్లో సేవలు మెరుగుపర్చండి

గజపతినగరం: సచివాలయాల్లో సేవలను మరింత మెరుగు పర్చాలని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి నిర్మలాదేవి ఆదేశించారు. మంగళవారం ఆమె తుమికాపల్లి, లోగిశ, సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలో అందిస్తున్న సేవలను సమీక్షించారు. సచివాలయాల ద్వారా అందించవలసిన సేవలు చాలా ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఎంపిడిఒ కె. కిషోర్ కుమార్ కూడా పాల్గొన్నారు.

సీతంలో వన మహోత్సవం

విజయనగరం: వన మహోత్సవంలో భాగంగా మంగళవారం సీతం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్. సతీష్ కుమార్ నేతృత్వంలో 50 మంది వాలంటీర్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



గజపతినగరంలోని బూర్లివీధిలో వినాయకుడిని దర్శించుకుంటున్న మంత్రి శ్రీనివాస్

నేరాలు ఘోరాలు

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కొత్తవలస: మండలంలోని సంతపాలెం సమీపంలో అక్రమంగా పశువులను బంధించి, గుట్టు చప్పుడు కాకుండా కబేలాలకు తరలిస్తున్న పశువులను సిఐ షణ్ముఖరావు తన సిబ్బందితో వెళ్లి మంగళవారం పట్టుకున్నారు. సంతపాలెం గ్రామ శివారులో అక్రమంగా పశువులను బంధించి ఉంచిన గోడౌనుపై రైడ్ చేసి అక్రమంగా పశువులు రవాణా చేయడానికి ఉన్న ముగ్గురు వ్యక్తులను, రెండు బులోరా వాహనాలను, 108 పశువులను స్వాధీన పరుచుకొని, ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ కేసులో గొట్టివాడ ఎరిబాబు, గొట్టివాడ నవీన్, ఇండిగబిల్లి దేవుళ్ళను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరంకోట: స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం గుర్తించినట్లు వన్‌టౌన్‌సిఐ శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం డయల్ 100 ఫోన్ ద్వారా సమాచారం వచ్చిన సమాచారం మేరకు ఆర్‌టిసి కాంప్లెక్స్ ఔట్‌గేట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని తెలిపారపు. అతడి వయసు 50-55 మధ్య ఉంటుందని, ఎటువంటి సమాచారం లేనందున మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.